
నమస్తే తెలంగాణ

# రంగారెడ్డి

I హైదరాబాద్, బుధవారం 31 జూలై 2024 RANGAREDDY


రెండో విడుత రుణమాఫీ లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక

## అర్హులకు రుణమాఫీ అందేలా చూడాలి

**రెండో విడుతలో 22,915 మంది రైతులకు రూ.218.12కోట్ల రుణమాఫీ**

**రంగారెడ్డి కలెక్టర్ శశాంక**

**కలెక్టరేట్‌లో రైతులకు రెండో విడుతకు సంబంధించిన రుణ మాఫీ చెక్కులను అందజేసిన కలెక్టర్**

రంగారెడ్డి, జూలై 30 (నమస్తే తెలంగాణ): అర్హులైన ప్రతి రైతుకూ రుణమాఫీ అందేలా చర్యలు చేపట్టాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అధికారులకు సూచించారు. రంగారెడ్డి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం కలెక్టర్ కె.శశాంక ప్రజాప్రతినిధులు, వ్యవసాయ అధికారులు, రైతుల ఆధ్వర్యంలో రుణమాఫీ రెండో విడుత నిధుల విడుదల కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొదటి, రెండో విడుతల రుణమాఫీ కార్యక్రమాలను రైతులు పండుగగా భావిస్తున్నారని పేర్కొన్నారు. జిల్లాలో మొదటి విడుతగా సుమారు 49,700 మంది రైతులకుగాను రూ.258.18 కోట్లు ప్రభుత్వం కేటాయించగా, రెండో విడుతలో సుమారు 22,915 మంది రైతులకు రూ.218.12 కోట్లు కేటాయించిందన్నారు. రెండు విడుతలు కలిపి సుమారు 72,615 మంది రైతులకు రూ.476.30 కోట్లు రుణ మాఫీ పథకం ద్వారా ప్రభుత్వం జిల్లాకు వెచ్చించిందన్నారు. ఇప్పటి వరకు జరిగిన రుణమాఫీలో సాంకేతిక కారణాలతో ఏ రైతుకైనా రుణమాఫీ అందకపోతే.. వారందరికీ మాఫీ వర్తించేలా వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు రుణ మాఫీ అందకపోవడానికి గల కారణాలు తెలుసుకోవడానికి ఆధార్‌కార్డ్‌తో మండలాల్లో వ్యవసాయ అధికారులను సంప్రదించి తెలుసుకోవచ్చని సూచించారు. జిల్లాస్థాయిలో, మండల వ్యవసాయ శాఖ స్థాయిల్లో రైతులకు గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు గ్రీవెన్స్‌లో పదకొండు వందల అప్లికేషన్స్ వచ్చాయని, వాటిని పరిష్కరించడానికి సంబంధిత అధికారులు చర్యలు చేపడుతున్నారని తెలిపారు. అర్హులైన ప్రతి రైతుకూ లబ్ధి జరిగేలా వ్యవసాయ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. బ్యాంక్ అధికారులనుద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రూ.లక్ష, లక్షన్నర లోపు రుణ మాఫీకి అర్హులుగా ఉన్న రైతులకు తిరిగి మళ్లీ పంట రుణాలు ఇచ్చే విధంగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డి, ప్రాథమిక సహకార సంఘం చైర్మన్లు, డైరెక్టర్లు, రైతు సంఘాల అధ్యక్షులు, బ్యాంకు అధికారులు, సంబంధిత అధికారులు, రైతులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

## రుణమాఫీపై అపోహలకు తావివ్వొద్దు..

**వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్**

వికారాబాద్, జూలై 30 : పంట రుణమాఫీపై రైతులు ఎలాంటి అపోహలకు తావివ్వొద్దని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. మంగళవారం రైతు నేస్తం పథకం ద్వారా రెండో విడుత రుణమాఫీ నిధుల విడుదల కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రాజేంద్రనగర్ వ్యవసాయ యూనివర్సిటీలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కార్యక్రమాన్ని రైతులు, పీఏసీఎస్ చైర్మన్లు, వ్యవసాయ అధికారులతో కలిసి కలెక్టర్ ఆన్‌లైన్ ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ.. రుణమాఫీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉన్నదని, రైతులకు ఎలాంటి సందేహం ఉండకూడదన్నారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు అర్హులైన లబ్ధిదారులకు రుణమాఫీ జరుగుతున్నదన్నారు. ప్రతి రైతు కుటుంబానికీ రూ.2 లక్షల చొప్పున రుణమాఫీ చేయడంలో భాగంగా మొదటి విడుతలో వికారాబాద్ జిల్లాలో 46,633 మంది లబ్ధిదారులకు రూ.256.26 కోట్లు రుణమాఫీ అయ్యిందన్నారు. రెండో విడుత రుణ మాఫీలో భాగంగా జిల్లాలో 26,438 మంది లబ్ధిదారులకు రూ.262.64 కోట్లు నిధులు విడుదలయ్యాయని తెలిపారు. రుణమాఫీ అయిన రైతులు కొత్తగా రుణాలు పొందే అవకాశం ఉన్నదని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏమైనా సందేహాలు ఉంటే వ్యవసాయ అధికారులు, బ్యాంకర్లను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులకు రుణమాఫీ చెక్కులను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

### జిల్లాకు రూ.262.64 కోట్ల నిధులు విడుదల..

వికారాబాద్ జిల్లాలో రైతు నేస్తంలో భాగంగా రెండో విడుత పంట రుణ మాఫీ కింద రూ.లక్షా 50 వేల లోపు ఉన్న రుణాలకుగాను రూ.262.64 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. రెండో విడుతలో జిల్లావ్యాప్తంగా 26,438 రైతు కుటుంబాలు లబ్ధి పొందాయన్నారు. జిల్లాలోని వికారాబాద్ నియోజకవర్గంలో 7,442 మంది లబ్ధిదారులకు 74.95 కోట్లు, తాండూరు నియోజకవర్గంలో 5,376 మంది రైతులకు 52.93 కోట్లు, పరిగి నియోజక వర్గంలో 6,166 మంది రైతులకు 62.06 కోట్లు, కొడంగల్ నియోజకవర్గంలోని కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మండలాలకు సంబంధించి 6,057 మంది రైతులకు రూ.61 కోట్ల రుణమాఫీతో పాటు చేవెళ్ల నియోజకవర్గంలోని నవాబుపేట మండలంలోని 1,397 మంది లబ్ధిదారులకు రూ.11.7 కోట్ల రుణమాఫీ చేసినట్లు పేర్కొన్నారు. రుణమాఫీ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్, లీడ్ బ్యాంక్ మేనేజర్ యాదగిరి, జిల్లా సహకార అధికారి ఈశ్వరయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారమేశ్, పీఏసీఎస్ చైర్మన్లు సత్యనారాయణ, లక్ష్మారెడ్డి, మొగులయ్య, సంతోష్ రెడ్డి, జయకృష్ణ, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

**అర్హుల జాబితాపై అయోమయం**

**కొంతమందికే రుణమాఫీ**



## మరో విడుతలోనూ..

# మాఫీ..మోసమే

- జిల్లాలో 22,915 మందికే రూ.లక్షన్నర రుణమాఫీ వర్తింపు
- రూ.218కోట్లతో సరిపెట్టిన ప్రభుత్వం
- నేటికీ అధికారులకు అందని అర్హుల జాబితా
- అర్హుల్లో భారీగా కోతలు పెట్టినట్లు రైతుల్లో అనుమానాలు
- మొదటి విడుతలో రైతుల నుంచి వచ్చిన 1,161 ఫిర్యాదులకు సైతం లభించని పరిష్కారం

రంగారెడ్డి, జూలై 30 (నమస్తే తెలంగాణ) : రెండో విడత రుణమాఫీ జాబితాను చూస్తే.. రైతుల అనుమానాలు నిజమే అనిపిస్తున్నాయి. మొదటి విడత మాదిరిగానే.. రెండో విడతలోనూ ప్రభుత్వం భారీగానే కోత విధించినట్లు గణాంకాలను చూస్తే అర్థమవుతున్నది. రెండో విడుతలో రంగారెడ్డి జిల్లాలో 22,915 మంది రైతులకు సంబంధించి రూ.218.12కోట్ల మాఫీ డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. రెండో విడుతలో అర్హుల సంఖ్య తక్కువగా ఉండడంతో ఈ దఫాలోనూ ప్రభుత్వం భారీగానే కోతలు పెట్టినట్లు తెలుస్తున్నది. రూ.లక్షలోపు రుణాలు తీసుకున్న వారే జిల్లాలో లక్షకుపైగా ఉంటారని అంచనా. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రెండు విడుతల జాబితాలు కలిపి 72,615 మంది రైతులకే రుణ మాఫీని వర్తింపజేయడంపై రైతుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### అర్హుల జాబితాపై గోప్యత..

రెండోవిడుతకు సంబంధించి అర్హుల జాబితాను ప్రభుత్వం విడుదల చేయకపోవడంపై రైతుల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మంగళవారం నాటికి కూడా అర్హుల జాబితా అధికారులకు అందలేదు. ఏయే బ్యాంకులకు సంబంధించిన రుణం ఎంత మాఫీ అయింది! అన్న వివరాలను మాత్రమే అధికారులకు అందించారు. దీంతో రూ.లక్షన్నర రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్న రైతుల్లో అయోమయం నెలకొన్నది. అసలు ఏ ప్రాతిపదికన ఎంపిక చేస్తున్నారన్న దానిపై రైతుల్లో సందేహాలు నెలకొన్నాయి. రైతుల వారీగా కాకుండా.. కేవలం బ్యాంకుల వారీగా రుణమాఫీ వివరాలను మాత్రమే ఇవ్వడం వల్ల.. ఎవరికీ రుణ మాఫీ అయిందో? ఎవరికీ కాలేదో? ఎలా చెప్పాలని అధికారులు సైతం వాపోతున్నారు.

### కలెక్టరేట్‌లో ఆరుగురికి లాంఛనంగా..

రెండో విడత రుణమాఫీ కార్యక్రమాన్ని రాష్ట్రస్థాయిలో సీఎం రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించగా.. ఈ కార్యక్రమాన్ని జిల్లాలోని రైతులంతా వీక్షించేలా 23 రైతు వేదికల్లో అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లాస్థాయిలో రెండో విడత రుణమాఫీ ప్రక్రియను లాంఛనంగా ప్రారంభించేందుకు రంగారెడ్డి కలెక్టరేట్‌లో ఏర్పాట్లు చేశారు. కలెక్టర్ శశాంక లాంఛనంగా రుణమాఫీ ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆరుగురు రైతులకు సంబంధించిన రుణమాఫీ చెక్కులను పంపిణీ చేశారు. రెండో విడత రుణమాఫీకి ప్రభుత్వం వెచ్చిస్తున్న రూ.218.12కోట్లకు సంబంధించిన జంబో చెక్కును సైతం ఈ సందర్భంగా అధికారులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి గీతారెడ్డి, జిల్లా కోఆపరేటివ్ అధికారి ధాత్రీదేవి, డీసీసీబీ చైర్మన్, టెస్కాబ్ వైస్ చైర్మన్ సత్తయ్య, పలువురు డీసీసీబీ చైర్మన్లు, పీఏసీఎస్ చైర్మన్లు పాల్గొన్నారు.

### మొదటి విడుత ఫిర్యాదులకు లభించని పరిష్కారం..

మూడు విడుతల్లో రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో భాగంగా ఈనెల 19న మొదటి విడుతను ప్రారంభించింది. ఈ మేరకు జిల్లాలో సుమారు 49,700 మంది రైతులకు రూ.258.18కోట్లను రుణమాఫీ చేసినట్లు ప్రభుత్వం చెబుతున్నది. తెల్ల రేషన్ కార్డు, ఆధార్ నంబర్, ఇతర వివరాలు లేకపోవడం.. అసలు కంటే వడ్డీ ఎక్కువగా ఉండడం వంటి కారణాలతో చాలామందికి రుణమాఫీ జరుగలేదు. ఆదాయపన్ను చెల్లింపుదారులు, ప్రభుత్వ ఉద్యోగులు, పింఛన్‌దారులను అర్హుల జాబితా నుంచి ప్రభుత్వం తొలగించడంతో మరికొంతమంది రైతులకు రుణ విముక్తి కలుగలేదు. ఇక జాబితాలో పేరు వచ్చినప్పటికీ జిల్లాలో 1,502 మంది రైతులకు సంబంధించి రూ.28కోట్ల వరకు మాఫీ డబ్బులు రైతుల ఖాతాల్లో జమ కాలేదు. మొదటి విడుతలో రుణమాఫీ కానివారి నుంచి వినతుల స్వీకరణకు జిల్లా వ్యవసాయ కార్యాలయంతోపాటు, మండలాల్లో ప్రభుత్వం హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో మండల వ్యవసాయ అధికారులు, ఈఏవోలకు జిల్లావ్యాప్తంగా 1,161 మంది రైతుల నుంచి ఫిర్యాదులు అందాయి. వీటికి ఇంకా పరిష్కారం లభించలేదు. పరిష్కారానికై ఫిర్యాదులను రాష్ట్రస్థాయి అధికారులకు పంపించామని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఇక రెండో విడుతలోనూ ప్రభుత్వం గత షరతులనే వర్తింపజేస్తున్నది. దీనికితోడు ఏమైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే మొదటి విడుత పరిస్థితే రానున్నది. మళ్లీ రైతులు అధికారుల చుట్టూ, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేయక తప్పదని రైతులు పేర్కొంటున్నారు.

**రూ.లక్షన్నర రుణమాఫీకి సంబంధించిన వివరాలు మండలాల వారీగా..**

| మండలం | అర్హులైన రైతులు |
|---|---|
| అబ్దుల్లాపూర్‌మెట్ | 375 |
| ఆమనగల్లు | 1,058 |
| బాలాపూర్ | 42 |
| చేవెళ్ల | 1,363 |
| ఫరూఖ్‌నగర్ | 1,446 |
| గండిపేట | 07 |
| ఇబ్రహీంపట్నం | 955 |
| చౌదరిగూడెం | 1,069 |
| కడ్తాల్ | 1,344 |
| కందుకూరు | 1,171 |
| కేశంపేట | 1,628 |
| కొందుర్గు | 884 |
| కొత్తూరు | 392 |
| మాడ్గుల | 2,479 |
| మహేశ్వరం | 658 |
| మంచాల | 1,319 |
| మొయినాబాద్ | 661 |
| నందిగామ | 507 |
| షాబాద్ | 1,122 |
| శంషాబాద్ | 327 |
| శంకర్‌పల్లి | 859 |
| తలకొండపల్లి | 2,234 |
| యాచారం | 1,065 |
| మొత్తం | 22,915 |

# రూటు మారిన రైల్వేలైన్

- కొడంగల్ కోసం పరిగికి అన్యాయం
- దూరంతోపాటు పెరిగిన అంచనా వ్యయం
- యాభై ఏండ్ల కల కల్లలేనా..?

పరిగి, జూలై 30 : రైలు కూత వినాలన్నది పరిగి ప్రాంత ప్రజల అర్ధ శతాబ్దపు కల. వికారాబాద్-కృష్ణా రైల్వేలైన్ మంజూరును కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఎన్నికలకు ముందు ప్రకటించగా, పరిగి ప్రజల కల నెరవేరబోతున్నదని, రైల్వేలైన్ నిర్మాణం ఇక శరవేగంగా సాగనున్నదని స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఇటీవల ప్రకటించారు. రైల్వేలైన్ నిర్మాణ ఫైల్ దుమ్ము దులిపిన ప్రభుత్వం వెంటనే పనులు జరిగేలా సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు చేపట్టారని, రూ.2వేల కోట్లతో రైల్వేలైన్ నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. వికారాబాద్ నుంచి పరిగి, దోమ మండలం మీదుగా కొత్త రైల్వేలైన్ నిర్మాణం జరుగుతున్నదని చెప్పడంతో కొద్ది కాలంలోనే పరిగి ప్రాంతానికి రైలు రాబోతున్నదని నియోజకవర్గ ప్రజలు సంతోషించారు. రైల్వేలైన్ పూర్తైతే పరిగితోపాటు దోమ, గండీడ్ మండలాలకు చెందిన ప్రజలు సైతం హైదరాబాద్‌కు రైలులో ప్రయాణించవచ్చని ఆశపడ్డారు. పక్కనే సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గం ఉండడంతో రైల్వేలైన్ నిర్మాణం తప్పనిసరిగా జరిగి ఈ ప్రాంతంతో రైల్వే అనుసంధానం ద్వారా పారిశ్రామికంగా సైతం అభివృద్ధి చెందుతుందని ఆశించారు. ఆదిలోనే హంసపాదు అన్నట్లు పరిగి, దోమ మండలాల మీదుగా వెళ్లాల్సిన రైల్వేలైన్‌ను పరిగి శివారు నుంచి కొడంగల్ మీదుగా మళ్లించడంపై పరిగి ప్రాంత ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో పరిగి శివారు నుంచే రైల్వేలైన్ కొడంగల్ నియోజకవర్గానికి వెళ్తున్నదని, పరిగి ప్రాంతానికి రైల్వేలైన్ విషయంలో అన్యాయం జరుగుతున్నదని పలువురు పేర్కొంటున్నారు.


### పరిగి ప్రజల అర్ధ శతాబ్దం కల..

రైల్వేలైన్ నిర్మాణం పరిగి ప్రాంత ప్రజల అర్ధ శతాబ్దం కల. ప్రతిసారీ ఎన్నికల హామీలో రైల్వేలైన్ నిర్మాణ అంశం నిలిచేది. వికారాబాద్ నుంచి పరిగి, దోమ మండలాల మీదుగా కృష్ణా వరకు రైల్వేలైన్ నిర్మాణం చేపట్టాలని గత యాభై ఏండ్ల క్రితమే ఓసారి సర్వే జరిగింది. అనంతరం రైల్వేలైన్ నిర్మాణం జరుగుతుందని రాజకీయ నాయకులు సైతం ఊరిస్తూ వచ్చారు. గతంలో పేర్కొన్న రూట్ ప్రకారం వికారాబాద్ నుంచి పరిగి, దోమ, సర్జఖాన్‌పేట్, మద్దూర్, నారాయణపేట్ తదితర ప్రాంతాల మీదుగా రైల్వేలైన్ నిర్మాణం జరుగుతుందని చెప్పారు. గత యూపీఏ హయాంలో అప్పటి కేంద్ర మంత్రి మునియప్ప సైతం పరిగిలో జరిగిన సమావేశంలో పాల్గొని వికారాబాద్-కృష్ణా రైల్వేలైన్ నిర్మాణం చేపడతామని ప్రకటించారు. దశాబ్దం తర్వాత రైల్వేలైన్ నిర్మాణ అంశం మళ్లీ ప్రజల ముందుకు వచ్చింది. ఎన్నికల తర్వాత వికారాబాద్-కృష్ణా రైల్వేలైన్ నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారని, ప్రభుత్వం నిధులు కేటాయిస్తున్నదని, రూ.2వేల కోట్లతో రైల్వేలైన్ నిర్మాణం చేపట్టనున్నట్లు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ప్రకటించారు. దీంతో పరిగి ప్రాంతం అన్ని రకాలుగా అభివృద్ధి చెందడానికి ఈ రైల్వేలైన్ దోహదం చేయనున్నదని ఈ ప్రాంతవాసులు భావించారు.

### పరిగి నుంచి కొడంగల్..

కొత్తగా ప్రతిపాదించిన ప్రకారం రైల్వేలైన్ నిర్మాణం వికారాబాద్, పరిగి, కొడంగల్, నారాయణపేట్, మక్తల్ మీదుగా చేపట్టాలని నిర్ణయించారు. 145 కిలోమీటర్ల రైల్వేలైన్ నిర్మాణానికి రూ.3500 కోట్లు ఖర్చవుతాయని రైల్వే శాఖ ఉన్నతాధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు సోమవారం సీఎం రేవంత్ రెడ్డి నిర్వహించిన సమీక్షా సమావేశంలో రైల్వే అధికారులు రైల్వే లైన్ రూట్ మ్యాప్‌ను వివరించారు. ఈ సందర్భంగా రైల్వేలైన్ రూట్ మ్యాప్‌పై సీఎం రేవంత్‌రెడ్డి పలు సూచనలు చేశారు. కొత్తగా ప్రతిపాదించిన రూట్‌లో రైల్వేలైన్ నిర్మాణం చేపడితే పరిగి ప్రాంతానికి అన్యాయం జరుగుతున్నదని పలువురు పేర్కొంటున్నారు. గతంలో ప్రతిపాదించిన రూట్‌లో రైల్వేలైన్ నిర్మాణం చేపడితే పరిగి, దోమ, గండీడ్ మండలాల ప్రజలకు రైల్వే లైన్ అందుబాటులో ఉండేది. ఈ మూడు మండలాల వారు తమ సమీప స్టేషన్ల నుంచి హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు రైలులో ప్రయాణించే సదుపాయం దక్కేది. అలాంటిది ఏకంగా రైల్వేలైన్ రూట్‌ను మార్చుచేసి కొత్త మార్గం వల్ల దూరం పెరగడంతోపాటు అంచనా వ్యయం సైతం పెరిగిందని, పరిగి ప్రాంతానికి రావాల్సిన రైల్వేలైన్ పరిగి నుంచి నేరుగా కొడంగల్‌కు వెళ్తున్నదని పేర్కొంటున్నారు. రైల్వేలైన్ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పరిగి ప్రాంతానికి అన్యాయం చేస్తున్నదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి గతంలో ప్రతిపాదించిన మార్గంలోనే రైల్వేలైన్ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. వికారాబాద్-కృష్ణా రైల్వేలైన్ నిర్మాణ మార్గాన్ని మార్చడం వల్ల పరిగి ప్రాంతానికి తీవ్ర అన్యాయం జరుగుతున్నదని మాజీ వైస్ ఎంపీపీ గుర్మిట్కల్ మల్లేశం ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి వికారాబాద్ నుంచి పరిగి, దోమ మండలాల మీదుగా రైల్వేలైన్ నిర్మాణం చేపట్టాలని కోరారు.





రైల్వే లైన్‌పై ప్రజాప్రతినిధులు, అధికారులతో చర్చిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి(ఫైల్)

### కొడంగల్ కోసం పరిగికి అన్యాయం..



వికారాబాద్-కృష్ణా రైల్వేలైన్‌ను కొడంగల్ మీదుగా తీసుకువెళ్లడం కోసం పరిగి ప్రాంతానికి అన్యాయం చేయడం సరికాదు. గతంలోనే వికారాబాద్ నుంచి పరిగి, దోమ మండలాల మీదుగా కృష్ణా వరకు రైల్వేలైన్ నిర్మాణం చేపట్టడానికి సర్వే నిర్వహించారు. ఈ రైల్వేలైన్ నిర్మాణం చేపడతామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. గెలిచిన తర్వాత రైల్వేలైన్ రూట్ మార్చే ప్రయత్నం సరికాదు. కొత్త రైల్వేలైన్ నిర్మాణం రూట్ మార్పుతో నియోజకవర్గంలోని దోమ మండలానికి, ఇతర గ్రామాలకు అన్యాయం జరుగుతున్నది. అందువల్ల రైల్వేలైన్ నిర్మాణాన్ని గతంలో పేర్కొన్నట్లుగానే పరిగి, దోమ మండలాల మీదుగా చేపట్టాలి.

– కొప్పుల మహేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, పరిగి